క్లుప్తంగా

పిటిషన్‌ను వెనక్కి తీసుకోవాలి

చారకొండ: లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని వేసిన పిటిషన్ వెనక్కి తీసుకోవాలని నాగర్‌కర్నూల్ జిల్లా బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నేనావత్ రవి నాయక్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులలో మాట్లాడారు. బంజారా లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని సుప్రీంకోర్టులో ఎమ్మెల్యే తెల్లం వెంకట్‌రావు, మాజీ ఎంపీ సోయం బాబురావులు వేసిన పిటిషన్‌పై అభ్యంతరం వ్యక్తం చేశారు. అన్యాయం చేస్తూ పోరాటాలు తప్పవని హెచ్చరించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేత



పెద్దకొత్తపల్లి: వెన్నచర్ల గ్రామానికి చెందిన మద్దిలేటి పులివెందులలో ప్రైవేటు కంపెనీలో కూలీగా పనిచేస్తూ ప్రమాదంలో మరణించడంతో బాధిత కుటుంబానికి కంపెనీ నుంచి రూ.10,55,457 లు మంజూరు అయ్యాయి. బుధవారం మృతుడి భార్య సుల్తానమ్మకు మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడు చెక్కు అందజేశారు.

చెక్కులు అందజేత

వెన్నచర్ల గ్రామానికి చెందిన మద్దిని చిట్టెమ్మకు రూ.60వేలు, మద్దిని మహేష్‌కు రూ.42,500 చెక్కులను మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడు ఆయా కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్ రాధ, మాజీ ఎంపీటీసీ రవికుమార్, బాలస్వామి, కొండల్‌రావు, పర్వతాలు, నారాయణగౌడు, శంకర్, రాములు, సుల్తాన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాంకింగ్ సేవలపై అవగాహన

కందనూలు: జిల్లా కేంద్రంలోని యాక్సిస్ బ్యాంక్ సిబ్బంది బుధవారం పల్లవి మోడల్ స్కూల్ విద్యార్థులకు స్పర్శ్ కార్యక్రమంలో భాగంగా బ్యాంకింగ్ సేవలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు బ్యాంకింగ్ ప్రాధాన్యం, వినియోగం, లోన్స్, క్రెడిట్ కార్డులు, డిపాజిట్లు, విత్‌డ్రావల్స్ వంటి అంశాలతో పాటు బ్యాంక్ అందించే విభిన్న సేవల గురించి సిబ్బంది వివరించారు. బ్రాంచ్ మేనేజర్ అనిల్ కుమార్, గోల్డ్ లోన్ మేనేజర్ చంద్రకాంత్, గుండ్ల శ్రీకాంత్, ముస్తఫా తదితర బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

నెలకొన్న సమస్యలపై సీపీఎం సర్వే

చారకొండ: మండల కేంద్రంతో పాటు పరిధిలోని జూపల్లి, చంద్రాయన్‌పల్లి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. రోడ్లు ధ్వంసం అయ్యాయని, డ్రైయినేజీలు అస్తవ్యస్తంగా ఉన్నాయని గుర్తించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి బండపల్లి బాలస్వామి మాట్లాడారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాయకులు మధు, శేఖర్ తదితరులు ఉన్నారు.

యూరియా పట్టివేత

పెంట్లవెల్లి: మండలంలోని మంచాలకట్ట కృష్ణానది దగ్గర కర్నూల్ జిల్లా మూర్వకొండ గ్రామానికి చెందిన మహేష్ కొల్లాపూర్ ప్రాంతం నుంచి మూడు బస్తాల యూరియాను ఇంజన్‌బోటు ద్వార తరలించేందుకు సిద్ధమతున్నాడు. విషయం తెలుసుకున్న అగ్రికల్చర్ అధికారులు అప్రమత్తమై పోలీసు, వ్యవసాయ అధికారులు కలిసి అక్కడకు చేరుకొని యూరియాను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం మహేష్‌ను వ్యవసాయ అధికారులు వికాస్, అశోక్‌రెడ్డి పోలీసులకు అప్పగించారు.

విఘ్నేశ్వరా నమో నమః



కల్వకుర్తిరూరల్/అచ్చంపేట/పెంట్లవెల్లి: నాగర్‌జిల్లాలోని పలు మండలాల్లో వినాయక నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం కల్వకుర్తిలో వివిధ మండపాల వద్ద భక్తులు దాండియా, కోలాటం ఆడారు. అచ్చంపేట పట్టణంలోని పద్మావతి కాలనీలో జై హింద్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ వద్ద బుధవారం నిర్వహించిన వేలంలో ముస్లిం మహిళ హాజీరా బేగం రూ. 73 వేలకు లడ్డు ప్రసాదాన్ని దక్కించుకున్నారు. పెంట్లవెల్లి, మంచాలకట్ట, మల్లేశ్వరం, జటప్రోల్ గ్రామాల్లో గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



రోడ్లపైనే సంత నిర్వహణ

- ప్రమాదాబారిన పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

పెద్దకొత్తపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో వారాంతపు సంతలు నిర్వహిస్తున్నారు. రోడ్లపై కూరగాయలు, వివిధ వస్తువుల విక్రయాలు జరుగుతుండటంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. పెద్దకొత్తపల్లి, పెద్దకారుపాముల, కల్వకోలు, సాతాపూర్, వెన్నచర్ల గ్రామాల్లో రహదారులపైనే వారాంతపు సంత నిర్వహిస్తున్నారు. గ్రామ పంచాయతీల సిబ్బంది, పోలీసు అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. మండల కేంద్రంలో పెద్దకారుపాముల రోడ్డుపై కూరగాయలు విక్రయించడంతో వనపర్తి నుంచి లింగాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులతో పాటు పెద్దకారుపాముల, చిన్నకారుపాముల, దేదినేనిపల్లి, చిన్న కొత్తపల్లి, యాపట్ల లింగాల వెళ్లే ప్రైవేటు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూరగాయాల సంతలో లారీ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందిన విషయం విధితమే. మండల కేంద్రంలో కూరగాయల సంతను తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా నిర్వహణకు అనువుగా ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

రాకపోకలకు ఇబ్బందులు

మండలంలోని పెద్దకారుపాముల, కల్వకోలు గ్రామాల్లో రోడ్లపై సంతలు నిర్వహించడంతో బస్సులు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. సాతాపూర్, వెన్నచర్ల లో కూడా ప్రధాన రహదారులపైనే వారంతపు సంతలు ఏర్పాటు చేయడంతో వాహనదారులకు నరకయాతన అనుభవిస్తున్నారు. మురిగిన కూరగాయలను రోడ్డుపైనే వస్తున్నారు. ఆయా గ్రామ పంచాయతీల సిబ్బంది పట్టించుకొని ప్రత్యేక స్థలాల్లో వారాంతపు సంతలను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



పెద్దకారుపాముల రోడ్డుపై నిర్వహిస్తున్న కూరగాయల సంత

అనువైన స్థలానికి మార్చాలి



మండల కేంద్రంలోని పెద్దకారుపాముల రోడ్డుపై నిర్వహించే కూరగాయల సంతను శివుని మాన్యం భూమి లేదా గ్రామ పంచాయతీ వీధుల్లో కూరగాయల సంతను నిర్వహించారు. పెద్దకొత్తపల్లి నుంచి లింగాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులకు, వాహనదారులకు సౌకర్యంగా ఉంటుంది. అనువైన స్థలాలను గుర్తించాలి.

– అశోక్‌గౌడు, పెద్దకొత్తపల్లి

ప్రభుత్వ స్థలాలు గుర్తిస్తున్నాం



మండలంలో పెద్దకొత్తపల్లి, పెద్దకారుపాముల, కల్వకోలు, సాతాపూర్, వెన్నచర్ల గ్రామాల్లో రోడ్లపై సంతలు నిర్వహించకుండా ప్రభుత్వ స్థలాలను గుర్తించి వాటిలో కూరగాయల సంతలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. రైతులు, ప్రజలు సహకరించాలి.

– నాగేందర్, ఎంపీడీఓ, పెద్దకొత్తపల్లి

రేపు జీపీఓ నియామక పత్రాల పంపిణీ

నాగర్‌కర్నూల్: ఈ నెల 5 వ తేదీన హైదరాబాద్ హైటెక్స్‌లో ముఖ్యమంత్రి జీపీఓలకు నియామక పత్రాలు అందజేస్తారని దీనికి అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్ బదావత్ సంతోష్, తెలిపారు. బుధవారం హైదరాబాద్ నుంచి జీపీఓ అభ్యర్థులు హైదరాబాద్ వెళ్లేందుకు చేయాల్సిన ఏర్పాట్లపై రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్ కుమార్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సెక్రెటరీ లోకేష్ కుమార్ పలు సూచనలు చేశారు. ఏర్పాట్లకు అన్ని చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వివరించారు. వీసీలో కలెక్టర్‌తో పాటు జిల్లా నుంచి కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్, అదనపు కలెక్టర్ పి అమరేందర్ హాజరయ్యారు.

పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ



ఉప్పునుంతల: పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటునట్లు ఎంఈఓ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మార్సీలో మండలంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. పాఠశాలలో అమలు చేస్తున్న పలు అంశాలపై చర్చించారు. ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఉన్నతి లిఫ్ కార్యక్రమం, ఎస్ఎస్‌సీ ఫలితాలు, ఈ విద్యా సంవత్సరంలో ఉత్తమ ఫలితాలపై తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై చర్చించారు. అదేవిధంగా విద్యార్థుల ఆరోగ్యం కోసం శిబిరాలు ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యను అందించాలి



ఊర్కొండ: విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించుటకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎంపీడీఓ కృష్ణయ్య అన్నారు. బుధవారం మండలంలోని ఊర్కొండపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటేందుకు తీసిన గుంతలను ఆయన పరిశీలించారు. పండ్ల, పూల మొక్కలను నాటాలని సూచించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. హెచ్‌ఎం అబ్దుల్ రహీం, పాఠశాలల ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి ఇబ్రహీం పాల్గొన్నారు.

పంటల సాగు నమోదు తప్పనిసరి

పెద్దకొత్తపల్లి: రైతులు వానాకాలం సాగు చేసిన పంటల వివరాలను వ్యవసాయ అధికారుల వద్ద నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి శిరీష తెలిపారు. మండల కేంద్రంలో పంటల నమోదు ప్రక్రియ డీసీఎస్ బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సర్వే నంబర్‌లో రైతులు సాగు చేసిన పంటలను వ్యవసాయ విస్తరణాధికారి వద్ద నమోదు చేయించుకోవాలని సూచించారు. ఏఈఓ ముజీబ్, రైతులు రాముడు, రాంబాబు పాల్గొన్నారు.

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో బుధవారం పంటల నమోదు ప్రక్రియ ముమ్మరంగా చేపట్టారు. మండల కేంద్రంతోపాటు, ఇంద్రకల్ పంటల వివరాలను అధికారలు నమోదు చేస్తున్నారు. కార్యక్రమంలో ఏఈఓ సందీప్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట



ఇంటిగ్రేటెడ్ వసతి గృహం నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

లింగాల: విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఇంటిగ్రేటెడ్ వసతి గృహం నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పీఎం జన్‌మన్ నిధులు రూ.2.30 కోట్లతో భవన నిర్మాణం చేపడుతునట్లు పేర్కొన్నారు. త్వరలో రూ. 4 కోట్లతో గిరిజన సంక్షేమ శాఖ వసతి గృహం నిర్మాణం చేపడుతామన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం, ఆడిటోరియం, నిజాం కాలంలో నిర్మించిన భవనానికి మరమ్మతు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే విద్యార్థినులకు యూనిఫాం పంపిణీ చేశారు. ఆశ్రమ పాఠశాలలో వసతుల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు. కస్తూర్బాబాలికల విద్యాలయాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. కార్యక్రమంలో ఎంఈఓ బషీర్ అహ్మద్, హెచ్‌ఎంలు కొండయ్య, మంగమ్మ, శారద, ఏఈ కోటేశ్వర్‌రావు, యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి శ్రీనివాస్‌రాథోడ్, నాయకులు శ్రీనివాసరావు, నాగేశ్వర్‌రావు పట్టణ అధ్యక్షుడు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

అచ్చంపేట రూరల్: రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. బుధవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లోని ట్రేడర్స్ కార్యాలయంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్ పర్సన్ అంతటి రజిత, నాయకులు మల్లేష్, వెంకటయ్య, కందూరి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేసే వరకు పోరాడుతాం



కల్వకుర్తిలో మాట్లాడుతున్న ఆచారి

కల్వకుర్తిరూరల్/వెల్దండ: హామీలు అమలు చేసే వరకు ఉద్యమిస్తామని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి అన్నారు. బుధవారం కల్వకుర్తి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన ఒక రోజు నిరాహార దీక్షకు, వెల్దండలో చేపట్టిన దీక్షకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీల అమలు కోసం నియోజకవర్గంలో మొదటి దశలో ర్యాలీలు నిర్వహించామని, రెండో దశలో 160 గ్రామ పంచాయతీల పరిధిలో ఒక రోజు నిరాహార దీక్ష చేపట్టామన్నారు. హామీలు అమలు చేయకపోతే ముఖ్యమంత్రి సొంత గ్రామం కొండారెడ్డిపల్లి ముట్టడిని చేపడుతామని హెచ్చరించారు. కల్వకుర్తి మండలంలో మర్చాల, ముకురాల, తర్నికల్ తదితర గ్రామాలలో బీజేపీ కార్యకర్తలు ఒక రోజు దీక్షను చేపట్టారు. దుర్గాప్రసాద్, నర్సింహ, రాంభూపాల్‌రెడ్డి, వివేకానంద, రాఘవేందర్‌గౌడ్, వెల్దండ బీజేపీ అధ్యక్షుడు యాదగిరి, శిల్పారెడ్డి, గీతారాణి, సుధారాణి, జంగయ్యయాదవ్, బాలస్వామి, కృష్ణారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మించాలి

ఊర్కొండ: ఊర్కొండ మండలంలోని రాచాలపల్లి నుంచి మాదారానికి బీటీ రోడ్డును నిర్మించాలని ఆచారి డిమాండ్ చేశారు. బీటీ రోడ్డు కోసం పాదయాత్ర చేస్తున్న బీజేపీ జనార్దన్ రెడ్డి మద్దతుగా ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. హామీల అమలులో ప్రభుత్వం విఫలం అయ్యిందన్నారు. అనంతరం ఊర్కొండ మండల కేంద్రంలోని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మండల అధ్యక్షుడు రాజేందర్ గౌడ్, లక్ష్మారెడ్డి, దుర్గాప్రసాద్, నర్సింహా, రాంచంద్రారెడ్డి, రాంభూపాల్ రెడ్డి, పరశురామ్, ఆంజనేయులు, బ్రహ్మచారి, సందీప్, కొమ్ము శ్రీను, గోపి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు మంజూరు చేయాలని ధర్నా



ఉప్పునుంతల: ప్రభుత్వం అర్హులైన వారికి కొత్త పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. ఎంపీడీఓ మోహన్‌లాల్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా సహాయ కార్యదర్శి చింతల నాగరాజు మాట్లాడుతూ ఎనిమిదేళ్లుగా కొత్తగా పింఛన్లు మంజూరు లేక ఎంతో మంది వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు సైదులు, వెంకట్రాంనాయక్, వెంకటయ్య, కేవీపీఎస్ నాయకులు కొండలు, కుర్మయ్య, మహిళలు పాల్గొన్నారు.

శ్మశాన వాటికను కాపాడాలని వినతి

వెల్దండ: మండలంలోని కొట్రలో ఎస్సీల శ్మశాన వాటిక స్థలం కబ్జాకు గురవుతోందని ఆ స్థలాన్ని కాపాడాలని బుధవారం తహసీల్దార్ కార్తీక్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు కబ్జాకు పాల్పడుతున్నారని వివరించారు. కార్యక్రమంలో వెంకటయ్య, మల్లేష్, హరిప్రసాద్, కృష్ణయ్య, మల్లేష్,శివ, మధు, శివ, నిరంజన్, శేఖర్ తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కందనూలు: జిల్లా కేంద్రంలోని శ్రీపురం రోడ్డులో ఉన్న ఆర్ట్స్ డిగ్రీ కళాశాల ఆంగ్లం బోధించుటకు అతిథి అధ్యాపకులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ గీతాంజలి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు ఈ నెల 6వ తేదీ మధ్యాహ్నం 12 గంటల వరకు కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. సెట్, నెట్ కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ

పెద్దకొత్తపల్లి: ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలని మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడు అన్నారు. బుధవారం మండలంలోని పెద్దకారుపాముల, సంజీవపూర్, దేవునితిర్మలాపూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం ఆయన భూమి పూజ నిర్వహించారు. లబ్ధిదారులకు మంజూరు పత్రాలను ఆయన అందజేశారు. మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ విష్ణు, మాజీ సర్పంచులు సత్యం, చిన్నయ్య, శ్రీనివాసులు, మాజీ ఉప సర్పంచు ఎల్లయ్య, సింగిల్ విండో డైరెక్టర్లు రాజుయాదవ్, మాజీ ఎంపీటీసీలు రవికుమార్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు వేయాలని వినతి

బల్మూర్: మండలంలోని పొలిశెట్టిపల్లిలో ప్రాథమికోన్నత పాఠశాలకు వెళ్లే రహదారిపై సీసీ రోడ్డు నిర్మించాలని స్వేరోస్ మండల అధ్యక్షుడు వస్కుల బాబు డిమాండ్ చేశారు. స్వేరోస్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్ జగదీష్‌కు వినతి పత్రం అందజేశారు. రామకృష్ణ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



మాట్లాడుతున్న బంగారుబాబు

కందనూలు: విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ సైన్స్ కళాశాల వద్ద గేట్ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగారు బాబు మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు రాకపోవడంతో రాష్ట్రంలో 13 లక్షల మంది బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్కాలర్‌షిప్‌లు నిధులు వెంటనే మంజూరు చేయకపోతే ఏబీవీపీ రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ ప్రసాద్ కుమార్, జిల్లా ఖేలో భారత్ కన్వీనర్ రమేష్, నగర సంయుక్త కార్యదర్శి మల్లేష్ యాదవ్, కళాశాల ప్రెసిడెంట్ శివ, ఏబీవీపీ నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఏడీ ఆరోపణలు అవాస్తవం

నాగర్‌కర్నూల్ రూరల్: చేపల పంపిణీకి సంబంధించి డీఎఫ్‌సీఎస్ కమిటీ సభ్యులపై మత్స్యశాఖ ఏడీ చేసిన ఆరోపణలను బుధవారం కమిటీ సభ్యులు ఖండించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిటీ చైర్మన్ వాకిటి అంజనేయులు మాట్లాడారు. మత్స్య సహకార సంఘంలో రికార్డులు డీఎఫ్‌సీఎస్ కమిటీ నాయకులు తారుమారు చేశారని ఏడీ చెప్పడం సరికాదన్నారు. మత్స్యశాఖ అధికారులు అవినీతిలో కూరుకుపోయారని ఆరోపించారు. కేసరపు వెంకటయ్య, అవుల ఈశ్వర్, బొమ్మసాని, సత్యనారాయణ, గొడుగు బాలచందర్, మంజుల, రాముడు, లక్ష్మయ్య, మల్కాపూరం సొసైటి అధ్యక్షులు చంద్రశేఖర్ రాముడు, తదితరులు పాల్గొన్నారు.

రైతువేదిక వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..



బల్మూర్: 'రైతువేదిక ట్రాన్స్‌ఫార్మర్ మాయం' శీర్షికతో బుధవారం సాక్షిలో వెలువడిన కథనానికి విద్యుత్‌శాఖ అధికారులు స్పందించారు. ఈ మేరకు మాయమైన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో బుధవారం 10 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చి రైతువేదిక భవనానికి విద్యుత్ సౌకర్యం కల్పించారు. కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

భక్తిశ్రద్ధలతో హోమాలు



తాడూరు: మండలంలోని గోవిందాయపల్లిలో బుధవారం వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం ఎదుట గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో హోమాలు, యజ్ఞాలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను విమర్శించడం సరికాదు

తాడూరు: ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డిలను విమర్శించే హక్కు మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డికి లేదని జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్, సింగిల్ విండో చైర్మన్ రాంచంద్రారెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బుధవారం వారు మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అధికారులను, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన ఘటనలను ప్రజలు మరిచిపోలేరన్నారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలపై మరోసారి అసత్య ఆరోపణలు చేస్తూ చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులు వెంకటయ్య, రమేష్, రాములు, ఆనందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బిజినేపల్లి: ఎమ్మెల్సీ దామోదర్‌పై మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి ఆరోపణలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మిద్దెరాములు ఖండించారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూరియా కొరతపై రైతులను మాజీ ఎమ్మెల్యే తప్పుదోవపట్టిస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్సీని అగౌరవపర్చేవిధంగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. సమావేశంలో కే. తిరుపతయ్య, గంగనమోని తిరుపతయ్య, అమృతరెడ్డి, వెంకటస్వామి, నసీర్, రాంచందర్, వాల్యనాయక్, మాన్యనాయక్, పరుశరాములు, చందర్‌నాయక్, మాన్యనాయక్, ముక్తార్ తదితరులు పాల్గొన్నారు.

బీసీటీఏ సభ్యత్వ నమోదు



తిమ్మాజీపేట: బీసీటీఏ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో బీసీటీఏ ఉపాధ్యాయుల సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన ప్రభుత్వ ఉచిత విద్య కోసం పనిచేసే బీసీటీఏ బలపర్చాలని ఉపాధ్యాయులను కోరుతూ సభ్యత్వాలు స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సి.భాస్కర్, ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఏ.మధుసూదన్, నాయకులు పవన్‌కుమార్, జహీరుద్దీన్ పాల్గొన్నారు.

హామీల అమలులో కాలక్షేపం తగదు

కొల్లాపూర్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంతో కాంగ్రెస్ ప్రభుత్వం కాలక్షేపం చేయడం తగదని బీఆర్ఎస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దేవని కుమార్ మాదిగ పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం, మహిళలకు రూ.2,500 నగదు, పింఛన్ల పెంపు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. 42 శాతం రిజర్వేషన్లను చట్టపరంగా అమలుచేస్తూ స్థానిక సంస్థల ఎన్నికలను వెంటనే నిర్వహించాలన్నారు. సమావేశంలో నాయకులు రాజుయాదవ్, మహేష్ తదితరులు ఉన్నారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

కల్వకుర్తిరూరల్: మండలంలోని తాండ్రా గ్రామ పంచాయతీ పరిధిలో బైక్ అదుపు తప్పిన సంఘటనలో ఇద్దరు యువకులు గాయపడిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ మాధవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన చరణ్, అజయ్ కల్వకుర్తి నుంచి సొంతూరు వెళ్తుండగా కొండారెడ్డిపల్లి గేటు సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడటంతో ఇద్దరికి గాయాలయ్యాయి. కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

అటవీహక్కులపై అవగాహన



అమ్రాబాద్: పదర మండలం ఇప్పలపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో బుధవారం కోనేరు సంస్థ ఆధ్వర్యంలో అటవీహక్కులపై అవగాహన సమావేశం నిర్వహించారు. సంస్థ కోఆర్డినేటర్ దుర్గారావు అడవులు, వన్యప్రాణుల రక్షణ, అటవీ హక్కులపై గిరిజనులకు వివరించారు. అడవులను కాపాడుకుంటూనే అటవీ ఉత్పత్తుల సేకరించి లబ్ధిపొందాలన్నారు. అనంతరం అటవీ హక్కుల నూతన కమిటీని ఏర్పాటు చేశారు. సమావేశంలో గ్రామ కార్యదర్శి గోపి, స్థానిక గిరిజనులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

కల్వకుర్తిరూరల్: ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ కోరారు. మండలంలోని ఎల్లికట్ట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు బుధవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించారు. కార్యక్రమంలో గణేష్, బీమయ్యగౌడ్, కేశవులు, రవి, స్వామిగౌడ్, తిరుపతయ్య, చంద్రయ్య, తిరుపతి తదితరులు ఉన్నారు.